క్లుప్తంగా

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా నుంచి కారుణ్య నియామకాల్లో భాగంగా మెడికల్ అన్‌ఫిట్ అయిన డెత్ కార్మికుల వారసులకు మంగళవారం జీఎం షాలేమురాజు చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేశారు. జీఎం మాట్లాడుతూ.. సింగరేణిలో ఉద్యోగం పొందటం అదృష్టమన్నారు. వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలని కోరారు. రామగుండం –1 ఏరియా భూగర్భ గనిలో పని చేసేందుకు నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షులు పంజాల శ్రీనివాసు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, సీనియర్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న దివ్యాంగులు

చుంచుపల్లి: కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో మంగళవారం డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరం క్యాంపుకు దివ్యాంగులు హాజరైన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సదరం క్యాంపుకు వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూశారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు వైద్యులు పరీక్షలు చేసి వైకల్యాన్ని నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన వారిలో 14 మందికి పూర్తిస్థాయిలో వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులతో పాటు డీఆర్డీఏ సిబ్బంది యాదయ్య, ప్రదీప్, ఆశిని, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా

సుజాతనగర్: కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడా హరి మంగళవారం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అధికార పార్టీ పెద్దల నుంచి బెదిరింపులు రావటం, దూషించి అవమానపరినందుకు తీవ్ర మనస్థాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్‌కు అందించినట్లు పేర్కొన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: మండలంలోని పునుకుల గ్రామ శివారులోని కిన్నెరసాని వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభం ఒరిగి కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. స్థానికులు పలుమార్లు విన్నవించుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ఈనెల 5న సాక్షి దినపత్రికలో అటెన్షన్ ప్లీజ్ శీర్షికలో 'ఏ క్షణమైనా పడిపోవచ్చు'అనే వార్తా కథనం ప్రచురితం అయింది. దీనికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మంగళవారం స్తంభాన్ని సరిచేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఊరంతా దుమ్ము.. ధూళి

- కాలుష్య కోరల్లో ప్రజలు విలవిల
- రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ



కేటీపీఎస్ బూడిద చెరువు

పాల్వంచరూరల్: కళ్లు తెరిస్తే దుమ్ము, ధూళి.. కళ్లు మూస్తే చీకటి. ఇది పాల్వంచలో పరిస్థితి. రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడంతో మట్టి రోడ్లకు తోడు కేటీపీఎస్ యాష్‌పాండ్ బూడిద కాలుష్యం ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. మండలంలోని సూరారం, పునుకుల గ్రామాలను అనుకుని ఉన్న కేటీపీఎస్ బూడిద చెరువు ద్వారా నిత్యం గాలిలోకి కాలుష్యం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీఎం జాతీయ రహదారిపై, తోగ్గూడెం క్వారీలు, బూడిద చెరువు నుంచి నిత్యం బూడిదను తరలించే భారీ వాహనాల సంఖ్య రోజురోజుకు పెరగుతోంది. దీంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. కళ్లకు ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా వెళ్లే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు.

కాలుష్యంతో అవస్థలు...

దుమ్ము, ధూళి కాలుష్యం కారణంగా మండలంలోని వాహనాదారులు పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏకాగ్రత లోపించడం, చూపు దెబ్బతినడం ఇంకా మానసిక సమస్యల బానిప పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దుమ్ము, ధూళి కారణంగా సున్నితమైన నేత్రాలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. నిత్యం నేరుగా వచ్చిపడే దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కళ్లలో నుంచి నీరుకారడం, మంటలు, కళ్లు ఎర్రగా మారడం వంటి సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు నేత్రవైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం వెయ్యికి పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికితోడు బూడిద కాలుష్యం, మట్టిరోడ్లు ఫలితంగా వాతావరణంలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉంది. దూళికణాలు ఘనపు మీటర్ గాలిలో 40 మైక్రో గ్రాములు నుంచి 60 మైక్రోగ్రాములు మించితే ప్రమాదమని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అంటున్నారు. మండలంలోని కేటీపీఎస్ 5వ దశ కర్మాగారం ప్రధాన గేటు నుంచి పాండురంగాపు వైపు వెళ్లే రహదారిలో మూడు కిలోమీటర్ల మేరకు రోడ్డు దెబ్బతిని ఉండటంతో ఈ మార్గంలో బూడిద లారీలు, కంటైనర్లు రేయింపగళ్లు రాకపోకలు సాగించడం వలన కాలుష్యం వెదజల్లుతోంది. అదే విదంగా తోగ్గూడెం క్వారీల నుంచి నిత్యం క్రషర్ లారీలు రాత్రీపగలు రాకపోకలు సాగిస్తుండటంతో జగన్నాథపురం, తోగ్గూడెం, తోగ్గూడెంతండా, బూడిద చెరువుకు సమీపంలో ఉన్న పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం, కరకవాగు గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. వేసవికాలంలో మరింత ఎక్కువగా చెరువు నుంచి బూడిద గాల్లోకి లేస్తుండడంతో ఆయా గ్రామాల్లో బూడిద కాలుష్యం తీవ్రంగా ఉంది.



తోగ్గూడెం రోడ్డులో లేస్తున్న దుమ్ము

ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి



కేటీపీఎస్ బూడిద చెరువు నుంచి వేసవికాలంలో గాలికి బూడిద కాలుష్యం ఎక్కువగా వెదజల్లుతోంది. గ్రామాల్లో బూడద పడి ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువు నుంచి బూడిద గాలిలో కలవకుండా నీటితో తరచూ తడుపుతూ ఉండాలి.

– హనుమంతరావు, పాండురంగాపురం

దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం



కేటీపీఎస్ 5వ దశ గేటు వద్ద కిలోమీటరు పొడవున రోడ్డు బాగా దెబ్బతిన్నది. దీంతో బూడిద వాహనాల రాకపోకలతో దుమ్ము వెదజల్లుతోంది. దీంతో నిత్యం రోడ్డుపై అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా కేటీపీఎస్ అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జగదీష్‌కుమార్, సర్పంచ్, పాండురంగాపురంతండా

చర్యలు తీసుకుంటున్నాం



బూడిద గాలిలోకి లేవకుండా నీటితో తడిపి చర్యలు తీసుకుంటున్నాం. కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్ నుంచి పాండురంగాపురం వైపు వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.1.7 కోట్లకు జెన్‌కో బోర్డు ద్వారా టెండర్ పిలిచాం. ఎవరూ రాలేదు. మరోసారి టెండర్‌కు పిలుస్తాం.

– ప్రభాకర్‌రావు, సీఈ, కేటీపీఎస్ 5వ దశ

అధికారుల తీరుతో జీసీసీ నిర్వీర్యం



మాట్లాడుతున్న ఉపేందర్

టేకులపల్లి: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) భద్రాచలం డివిజన్ మేనేజర్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జీసీసీలో కొంతమంది కింది స్థాయి సిబ్బందిని ఏజెంట్లుగా పెట్టుకుని తనకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులను డ్యూటీ చేయకపోయినా నెల నెలా జీతాలు ఇప్పిస్తూ వారిని ప్రైవేట్ కార్యక్రమాలకు వినియోగిస్తూ సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. భద్రాచలం డివిజన్ పరిధిలో అటవీ ఉత్పత్తులు ముష్టి గింజలు, చిల్ల గింజలు, ఇప్ప పువ్వులను సేకరిస్తున్న గిరిజనుల నుంచి స్థానిక సేల్స్‌మెన్లు కొనుగోలు చేయకుండా డీఎం అడ్డుపడుతూ సొంతంగా కొందరిని ఏజెంట్లుగా పెట్టుకుని బ్లాక్ మార్కెటింగ్ చేయిస్తున్నాట్లు చెప్పారు. భద్రాచలం డివిజన్ నుంచి పక్క రాష్ట్రాలైన ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు 5వేల క్వింటాళ్ల ముష్టిగింజలను తరలించినట్లు పేర్కొన్నారు. ఈ అక్రమ దందా వల్ల తెలంగాణలోని జీసీసీకి రూ.3 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. 2017–18లో డీఎంగా పని చేసిన కాలంలో స్టాక్‌లో తప్పుడు లెక్కలు చూపించి ఏజెంట్ల ద్వారా ఇప్పపువ్వులను సైతం బ్లాక్ మార్కెట్‌కు తరలించాడని ఆరోపించారు. కార్యక్రమంలో పూనెం బాలకృష్ణ, వట్టం కన్నయ్య, వర్ష శ్రీను, పూనెం శ్రీను, దుగ్గా రపు వీరభద్రం మోకాళ్ల కన్నయ్య పాల్గొన్నారు.

రంజాన్ 'తోఫా' పంపిణీ



తోఫా అందజేస్తున్న కూనంనేని సాంబశివరావు

సుజాతనగర్: పేదల ఆకలిని గుర్తించేదే పవిత్ర రంజాన్ మాసమని, ఈ పండుగలో పేదలను భాగస్వామ్యం చేసి వారిని సంతోషంగా ఉంచడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల కేంద్రంలో 170 పేద కుటుంబాలకు మంగళవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ.. నిరుపేద ముస్లిం కుటుంబాల అభ్యున్నతి కోసం చర్యలు చేపట్టాల్సిన పాలకులు తాత్కాలిక ఉపశమనాలతో, పండుగ కానుకలతో మభ్యపెడుతున్నారని విమర్శించారు. వేలాది ముస్లిం కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన జీవనం గడుపుతున్నారని, గడిచిన తొమ్మిదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికోసం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, వెల్ఫేర్ సంస్థ అధ్యక్షుడు నయీం ఖురేషి, ముస్లిం పెద్దలు, స్థానికులు డాక్టర్ ఫారూఖీ, షేక్ భణిగిరి, అల్లాభక్ష, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న సర్పంచ్ మంగమ్మ

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ వల్లాల మంగమ్మ మంగళవారం గ్రామపంచాయతీ కూడలిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇల్లెందు నుంచి ఖమ్మం, కొత్తగూడెం వెళ్లే కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

డిగ్రీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



నియామక పత్రం అందుకుంటున్న కిరణ్‌కుమార్

ఇల్లెందురూరల్: డిగ్రీ అధ్యాపకుల సంఘం ఇల్లెందు యూనిట్ అధ్యక్షుడిగా కె.కిరణ్‌కుమార్, కార్యదర్శిగా పంచమర్తి శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన ఎన్నికల్లో విజేతలను డాక్టర్ చేకూరి రమేష్ ప్రకటించారు. ఈ మేరకు నూతన కార్యవర్గానికి ఎన్నిక పత్రాలను ఆయన అందజేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మ అభినందించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు

జూలూరుపాడు: స్థానిక జామా మజీద్‌లో మంగళవారం రాత్రి ముస్లింలకు మార్నింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు ప్రతీకగా నిలిచారు.

కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ క్లబ్ సభ్యులు మోదుగు ప్రభాకర్, వేల్పుల నరసింహారావు, కాశిబోయిన నరేస్, మోదుగు సుగుణరావు, మోదుగు ఆదామ్, వరికూటి రవి, రాజు, కొమ్మినేని లక్ష్మణ్, డాక్టర్ రామకృష్ణ, వేల్పుల బోస్, ఇడుపుల రాజు, ఉబ్బపల్లి సంజీవరావు, జోషి, మతబోధకుడు మౌలీ సాహెబ్, జామా మజీద్ అధ్యక్షుడు ఎస్కే సిద్ధిక్, ఎస్కే రఫీ, ఎస్కే షఫీ, ఎస్కే మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

కరోనాపై ముగిసిన మాక్ డ్రిల్



పెనగడప పీహెచ్‌సీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

చుంచుపల్లి: జిల్లాలో రెండు రోజుల పాటు కరోనా నియంత్రణ ఏర్పాట్లపై చేపట్టిన మాక్ డ్రిల్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. జిల్లాలోని ప్రధాన ఆస్పత్రులు, పలు ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మాక్ డ్రిల్ ద్వారా కావాల్సిన వసతులను వైద్యశాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులు, మందులు, కిట్లు, సిబ్బంది, బెడ్స్, ఇతర పరికరాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మంగళవారం పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష పరిశీలించారు. సిబ్బందిని పీహెచ్‌సీ పరిధిలో అందుబాటులో ఉన్న వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తున్నారని పరిశీలించారు. సిబ్బందితో కలిసి పాత కొత్తగూడెం, గౌతంపూర్‌లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్ర కారణంగానే సమావేశానికి దూరం

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ కుట్ర కారణంగా జేబీసీసీఐ సమావేశానికి ఐఎన్‌టీయూసీ దూరంగా ఉండాల్సి వచ్చిందని జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ అన్నారు. అయినప్పటికీ తామే విజయం సాధించి 11వ వేజ్‌బోర్డులో పర్మనెంట్ సభ్యుడిగా జనక్ ప్రసాద్‌ను నియమించుకున్నట్లు చెప్పారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే వర్క్‌షాపులో మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో తెలంగాణ రాకముందు రూ.3,800 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు ఉండగా, ఇప్పుడు రాజకీయ జోక్యంతో అప్పుల్లోకి చేరిందని పేర్కొన్నారు. సమావేశంలో నాగభూషణం, ఆల్బర్ట్, రాజేశ్వరరావు, బి.సైమన్, ఎం.అశోక్, రమణయ్య, వెంకటస్వామి, లక్ష్మణ్‌రావు, విజయ్‌కుమార్, సూరిబాబు, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ స్పాట్ విధులు కేటాయించాలి



మాట్లాడుతున్న హరిలాల్ నాయక్

టేకులపల్లి: పదో తరగతి స్పాట్ విధుల కేటాయింపులో జిల్లా ఉపాధ్యాయుల పట్ల విద్యాశాఖ చిన్న చూపు చూస్తోందని, ఉమ్మడి జిల్లాను పరిగణలోకి తీసుకుని ఈసారి భద్రాద్రి జిల్లా ఉపాధ్యాయులకు కూడా విధులు కేటాయించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోయగూడెంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయకపోగా కనీసం ఈ ప్రాంత ఉపాధ్యాయులకు విధులు కేటాయించకపోవడం గర్హనీయమన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులకు సమాన నిష్పత్తిలో స్పాట్ విధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు బి.సైదులు, ఈ.ముత్తయ్య, ఎం.శారద, బి.కస్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరు యాత్రను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: బీజేపీకో హఠావో...దేశ్‌కో బచావో..., ఇంటింటికీ సీపీఐ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సాగుగుతున్న ప్రజా పోరు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నేత గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో పోరు యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సీపీఐ జాతీయ సమితి, తెలంగాణ రాష్ట్ర సమితిల పిలుపు మేరకు ఈనెల 14న చర్ల మండలంలో ప్రారంభమయ్యే పోరు యాత్ర 18న టేకులపల్లికి చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా టేకులపల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో గుగులోత్ శ్రీను, వాసం భద్రయ్య, అయిత శ్రీరాములు, ఈసం నరేష్, చింత కన్నయ్య, వాసం నరేందర్, సోనీ పాల్గొన్నారు.

సమష్టిగా పని చేద్దాం..



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీవీ



హాజరైన మున్సిపల్ సిబ్బంది

ఇల్లెందు: మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు కలిసి కట్టుగా కృషి చేసి పట్టణాన్ని పురోభివృద్ధి దిశగా పయనింపజేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగింపు జరిగిందని, కొత్త సంవత్సరంలో అంతా కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. గడిచిన జనవరి నాటికి 90 శాతం పన్నులు వసూలు చేశారని, మిగిలిన 10 శాతం పన్నులను వసూలు చేసి నూరుశాతం లక్ష్యం పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అంకుషావలీ, ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సమసమాజ స్వాప్నికుడు జ్యోతిరావు పూలే



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: పూలేకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ, కమిషనర్ అంకుషావలి తదితరులు



చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కొత్తగూడెంటౌన్: కోర్టులో పూలే జయంతి వేడుకలు



జూలూరుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో...



పాల్వంచ: మాట్లాడుతున్న కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావు



పాల్వంచ: సీఐటీయూ ఆధ్వర్యంలో...



పాల్వంచరూరల్: నివాళులర్పిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివాజీ



టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో...



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా సీసీ రోడ్డు

సీసీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. పాల్వంచ మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రామాలయం సమీపంలో రూ.8.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతా లోపం కారణంగా బీటలు బారింది. దీంతో ఈ వీధిలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనాదారులకు, ఆటోలకు ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

– పాల్వంచరరూల్



ప్రశ్నించాల్సిన అధికారి : అనిల్‌కుమార్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ
సెల్ నంబర్ : 9542843923